సాక్షి రంగారెడ్డి

గురువారం । 23 । మార్చి । 2023



జీతాల 'పంచాయితీ'
పంచాయతీ కార్మికులు, సిబ్బంది బతుకులు అగమ్యగోచరంగా మారాయి. వేళకు జీతాలు అందక అనేక కష్టాలు పడుతున్నారు. 8లో▸



సేంద్రియ సాగుతో..
సేంద్రియ సాగుతో నేల, నీరు, వాతావరణం కలుషితం కాదని నాబార్డ్ జిల్లా మేనేజర్ పివి శర్మ పేర్కొన్నారు. 8లో▸

ఓయూలో నేడు భగత్‌సింగ్ సినిమా ప్రదర్శన
ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట గురువారం భగత్‌సింగ్ సినిమాను ప్రదర్శించనున్నట్లు బుధవారం వామపక్ష విద్యార్థి నేతలు తెలిపారు. భగత్‌సింగ్, రాజగురు, సుఖ్‌దేవ్‌ల 92వ వర్ధంతి సందర్భంగా ఆర్ట్స్ కాలేజీ ఎదుట సాయంత్రం 5 గంటలకు 'ద లెజెండ్ భగత్‌సింగ్' చిత్రాన్ని ప్రదర్శించనున్నామని, దీనిని వీక్షించేందుకు అందరూ ఆహ్వానితులేనని పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

రామలింగేశ్వరాలయంలో అఘోరా పూజలు

ఆమనగల్లు: ఆమనగల్లులోని రామలింగేశ్వర స్వామి ఆలయంలో బుధవారం డేరంబాబా(అఘోరా) ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాశీ నుంచి రామేశ్వరం వెళ్తున్న డేరంబాబా తన శిష్యులతో కలిసి శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పలువురు భక్తులు డేరంబాబా ఆశీర్వాదాలు తీసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు రేగటి శ్రీనివాస్, పూజారులు మల్లికార్జు స్వామి, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీగణపతి ఆలయంలో భక్త రామదాసు వారసుడు



ఆలయ కమిటీ సభ్యులతో భక్త రామదాసు వారసుడు కంచర్ల వెంకటరమణ

మీర్‌పేట: శివసాయినగర్ కాలనీలోని శ్రీగౌరీ నీలకంఠేశ్వర స్వామి సమేత లక్ష్మీగణపతి ఆలయాన్ని భక్త రామదాసు 11వ తరం వారసులైన కంచర్ల వెంకటరమణ బుధవారం సందర్శించారు. ఈనెల 30న శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలంలో జరిగే సీతారాముల కల్యాణానికి భక్తుల చేతి గోళ్లతో వడ్లు ఒలిచి ఆ బియ్యాన్ని ముత్యాల తలంబ్రాలలో వినియోగిస్తారు. ఈ సందర్భంగా వడ్లను కంచర్ల వెంకటరమణ.. ఆలయ కమిటీ సభ్యులు సంతోష్‌రెడ్డి, వెంకట కృష్ణారావు, వెంకటరమణ, లక్ష్మీగణపతిరావు, టీటీడీ ధర్మప్రచార పరిషత్ సభ్యులు జనార్దన్‌కు అందజేశారు. అనంతరం ఉగాది పర్వదినం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

రేపు అనూరాధ పొడ్వాల్‌కు పురస్కార ప్రదానం

గన్‌ఫౌండ్రీ: ఈ నెల 24న రవీంద్రభారతిలో బాలీవుడ్ సింగర్ పద్మశ్రీ అనూరాధ పొడ్వాల్‌కు ప్రైడ్ ఆఫ్ ఇండియా పురస్కారం అందజేయనున్నట్లు ప్రముఖ గాయని ఆమని బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. శృతిలయ ఆర్ట్స్ అకాడమీ, సీల్‌వెల్ కార్పొరేషన్, తిరుమల బ్యాంక్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కె.దామోదర్ గుప్తా, సీల్‌వెల్ కార్పొరేషన్ ఎండీ బండారు సుబ్బారావుతో పాటు పలువురు ప్రముఖులు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సంగీత విభావరి ఉంటుందని, సినీ అభిమానులు పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు.

హ్యాండ్లూం వస్త్రాలకు విశేష ఆదరణ

సాక్షి, సిటీబ్యూరో: గ్రామీణ హస్తకళా వికాస్ సమితి నేతృత్వంలో బంజారాహిల్స్ రోడ్ నంబర్- 12లోని కళింగ కల్చరల్ హాల్‌లో ఏర్పాటు చేసిన హ్యాండ్లూం ఇండియా- 2023 వస్త్ర ప్రదర్శనను బుధవారం సామాజికవేత్త బినా మెహతా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతిలో సిల్క్, హ్యాండ్లూం వస్త్రోత్పత్తులకు ఎంతో ప్రత్యేకత ఉందన్నారు. ఇప్పటికీ వీటికి వన్నె తగ్గలేదన్నారు. నేటి తరం యువత కూడా హ్యాండ్లూం ఉత్పత్తులను ఎంతో ఆదరిస్తున్నారన్నారు. ఈ నెల 29 వరకు కొనసాగనున్న ప్రదర్శనలో దేశంలోని 14 నగరాల నుంచి పలువురు చేనేత కళాకారులు సిల్క్ హ్యాండ్లూం చీరలు, డ్రెస్ మెటీరియల్ వంటి వేలాది రకాల వస్త్రోత్పత్తులను అందుబాటులో ఉంచారని నిర్వాహకుడు జయేష్ తెలిపారు.

రంజాన్ ప్రత్యేక ప్రార్థనలకు మసీదుల్లో అన్ని ఏర్పాట్లు



బంజారాహిల్స్: రంజాన్ పవిత్ర మాసాన్ని పురస్కరించుకుని నగరంలోని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనల కోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని హోం మంత్రి మహమూద్ అలీ అన్నారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆధ్వర్యంలో నియోజకవర్గ పరిధిలోని మసీదు కమిటీలతో బుధవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రంజాన్ ఉపవాస దీక్షల సందర్భంగా మసీదుల్లో ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలని పేర్కొన్నారు. ఎమ్మెల్యే దానం నాగేందర్ మాట్లాడుతూ.. ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కవితారెడ్డి, సంగీతా యాదవ్ పాల్గొన్నారు.



పహాడీషరీఫ్: బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పంచాంగ శ్రవణం

'శోభకృత'మే..

జిల్లావ్యాప్తంగా తెలుగు సంవత్సరాది.. ఉగాది పర్వదినాన్ని బుధవారం ఘనంగా జరుపుకొన్నారు. పండుగను పురస్కరించుకుని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శోభకృత్ నామ సంవత్సరమంతా శోభాయమానంగా ఉంటుందని, నదులు, జలాశయాలు, పాడిపంటలు కళకళలాడుతాయని చిలుకూరు బాలాజీ ఆలయ అర్చకుడు రంగరాజన్ వివరించారు. ప్రధాన ఆలయాల్లో నిర్వహించిన పంచాంగ శ్రవణ కార్యక్రమాలకు హాజరైన ప్రజలు తమతమ రాశి ఫలాలను తెలుసుకున్నారు.



మొయినాబాద్: చిలుకూరు బాలాజీ ఆలయంలో పంచాంగ పఠనం చేస్తున్న అర్చకుడు రంగరాజన్

జనంలోనే మనం

బీఆర్‌ఎస్ యాక్షన్ ప్లాన్ రెడీ
- నిత్యం ప్రజాక్షేత్రంలోనే ఉండేలా ప్రత్యేక కార్యాచరణ
- ఎన్నికల ప్రణాళికను ప్రకటించిన అధికార పార్టీ
- ఆత్మీయ సమ్మేళనాల పేరుతో వరుస కార్యక్రమాలు
- తేదీల వారీగా స్పెషల్ క్యాలెండర్
- సంక్షేమ పథకాలు.. అభివృద్ధి మంత్రంతో ముందుకు
- పార్టీ ముఖ్య నేతలతో చర్చించిన జిల్లా ఇన్‌చార్జ్



సాక్షి, రంగారెడ్డి జిల్లా: సాధారణ ఎన్నికల గడువు సమీపిస్తుండటంతో భారత రాష్ట్ర సమితి(బీఆర్‌ఎస్) క్షేత్ర స్థాయిలో పార్టీ పటిష్టతపై దృష్టి సారించింది. జిల్లా మంత్రి సహా ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులంతా ఇకపై నిత్యం ప్రజల్లో ఉండాలని నిర్ణయించింది. ఆ మేరకు పార్టీ అధిష్టానం ఇప్పటికే జిల్లాల వారీగా ఇన్‌చార్జ్‌లను నియమించి.. కేడర్‌ను అప్రమత్తం చేసే పనిలో నిమగ్నమైంది. అంతర్గత విభేదాలను పక్కన పెట్టి, మండలాలు, మున్సిపాలిటీలు, నియోజకవర్గాల వారీగా సభలు, సమావేశాలు నిర్వహించి, పార్టీకి పూర్వవైభవం తీసుకురావాలని నిర్ణయించింది. ఈ మేరకు ఆత్మీయ సమ్మేళనాల పేరుతో ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు వరుస కార్యక్రమాలను ప్రకటించింది. అక్టోబర్‌లో ఎన్నికల శంఖారావ సభలు నిర్వహించాలని పేర్కొంది. ఇందుకు ప్రముఖుల పుట్టిన రోజులు, వర్ధంతులు, జయంతులు ఇలా అందివచ్చిన ప్రతీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్ణయించింది. ప్రభుత్వ సంక్షేమ పథకాలు సహా ఇప్పటి వరకు చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించి, వారికి మరింత చేరువయ్యేందుకు ప్రత్యేక కేలండర్‌ను రూపొందించింది. ఈ మేరకు రెండు రోజుల క్రితం పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ ఎల్.రమణ ప్రజాప్రతినిధులు, నేతలతో సమావేశమై ఈ అంశాలను వివరించారు.

మూడోసారి అధికారమే లక్ష్యం

రాష్ట్రంలో మూడోసారి అధికారంలోకి రావాలని బీఆర్‌ఎస్ భావిస్తోంది. ఇందుకోసం పక్కా యాక్షన్ ప్లాన్‌ను అమలు చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా ఏప్రిల్ 14న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భారీ విగ్రహావిష్కరణ, 25న పార్టీ నియోజకవర్గ ప్రతినిధుల సభ, 27న పార్టీ ఆవిర్భావ సభ, 30న సచివాలయ ప్రారంభోత్సవం, మే ఒకటో తేదీన ప్రపంచ కార్మిక దినోత్సవం, మొదటి వారంలో విద్యార్థి యువజన సమ్మేళనాలు, సోషల్ మీడియా వారియర్లతో మీటింగ్‌లు, మే మూడో వారంలో విద్యార్థి, యువజన కమిటీల ఏర్పాటు, జూన్ ఒకటో తేదీన తెలంగాణ అమరవీరుల స్థూపం ఆవిష్కరణ, 2న రాష్ట్ర అవతరణ వేడుకలు, జూన్ రెండో వారంలో విద్యార్థి విభాగం సభ్యత నమోదు.. నూతన విద్యార్థులకు స్వాగత కార్యక్రమాలు, 16న దళితబంధు రెండో వార్షికోత్సవాలు, 17న జాతీయ సమైక్యత దినోత్సవం, ఇలా ఎప్పటికప్పుడు ప్రత్యేక కార్యక్రమాలతో ప్రజల్లో ఉండాలని నిర్ణయించింది. తమకు తగిన గుర్తింపు లభించడం లేదని, గత కొంతకాలంగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్న సీనియర్ లీడర్లను గుర్తించి, వారిని మళ్లీ యాక్టీవ్ చేయాలని యాక్షన్ ప్లాన్‌లో పేర్కొన్నారు. ప్రధానంగా విద్యార్థులు, యువతను ఏకం చేయడం ద్వారా బీజేపీ, కాంగ్రెస్‌కు వచ్చే ఎన్నికల్లో చెక్ పెట్టాలని నిర్ణయించారు.

అసమ్మతి గళం

ఓ వైపు ఎన్నికల గడువు సమీపిస్తుంటే.. మరో వైపు పార్టీలో అంతర్గత విభేదాలు తార స్థాయికి చేరుకుంటున్నాయి. మహేశ్వరం, కల్వకుర్తి, ఇబ్రహీంపట్నం, ఎల్బీనగర్, చేవెళ్ల నియోజకవర్గాల్లో ఇప్పటికే పలువురు పార్టీ నేతలు బహిరంగంగానే పరస్పర విమర్శలకు దిగారు. ఎన్నికల్లో పోటీకి ఒక్కో నియోజకవర్గం నుంచి ఇద్దరు ముగ్గురు సై అంటున్నారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో అధినాయకత్వం ఇచ్చిన యాక్షన్‌ను ఫాలో అవుతారో? లేదో వేచి చూడాల్సిందే. ఇదిలా ఉండగా జిల్లా కమిటీ ఏర్పాటు అంశం పార్టీలో చర్చనీయాంశంగా మారింది. జిల్లా అధ్యక్షుడిగా ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని నియమించి ఏడాది దాటింది. గ్రామ, మండల, మున్సిపల్ కమిటీలను కూడా ఏర్పాటు చేసుకున్నారు. కానీ ఇప్పటి వరకు జిల్లా కేడర్ మొత్తం ఒకే వేదికపై సమావేశమైన దాఖలాలు లేవు. పూర్తి స్థాయిలో జిల్లా కమిటీని ఏర్పాటు చేయలేని పరిస్థితిలో ఉన్న బీఆర్‌ఎస్ పార్టీ తొమ్మిది నెలల పాటు ప్రజల్లో ఎలా ఉండబోతోందనేది అంతుచిక్కని ప్రశ్నలా కనిపిస్తోంది. పార్టీలో అసమ్మతి గళాన్ని ఎలా శాంతింపజేస్తారు? వారంతా చివరి వరకు పార్టీలో ఉంటారా..? లేదా వేచి చూడాల్సిందే.



శంకర్‌పల్లిలో నిర్మించిన నూతన మసీదులో ప్రార్థనలు చేస్తున్న హోం మంత్రి మహమూద్ అలీ

సర్వ మతాలకు సమ ప్రాధాన్యం

- అన్నివర్గాల అభ్యున్నతే సీఎం కేసీఆర్ ధ్యేయం
- హోంమంత్రి మహమూద్ అలీ
- శంకర్‌పల్లిలో నూతన మసీదు ప్రారంభం

శంకర్‌పల్లి: అన్నివర్గాల అభ్యున్నతికి సీఎం కేసీఆర్ ఎంతగానో కృషిచేస్తున్నారని హోంశాఖ మంత్రి మహమూద్ అలీ అన్నారు. పట్టణంలో నిర్మించిన నూతన మసీదు(తాలిఫ్ అజీజ్)ను చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యతో కలిసి బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మసీదులో ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్న ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని తెలిపారు. రాష్ట్రంలోని ఆలయాలు, మసీదులు, చర్చిలకు ప్రత్యేక నిధులు మంజూరు చేశారన్నారు. అన్ని మతాల వారు పండుగలను ఘనంగా జరుపుకొనేలా ప్రభుత్వం తరఫున చేయూతనిస్తున్నారని వివరించారు. ముస్లింలకు రంజాన్ తోఫా, క్రైస్తవులకు క్రిస్మస్ కానుక, హిందువులకు బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తూ సర్వమతాలను సమానంగా చూస్తున్నారన్నారు. పవిత్రమైన రంజాన్ మాసాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని సూచించారు. రంజాన్ మాసం మొదటి రోజును మసీదును ప్రారంభించుకోవడం సంతోషకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో శంకర్‌పల్లి పీఏసీఎస్ చైర్మన్ బద్దం శశిధర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ పాపారావు, టీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గోపాల్, మున్సిపల్ అధ్యక్షుడు వాసుదేవ్‌ఖన్నా, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు ఫరీద్, నాయకులు సాత ప్రవీణ్‌కుమార్, గోపాల్‌రెడ్డి, పార్శి బాలక్రిష్ణ, గోవర్ధన్‌రెడ్డి, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను కోసం ఆఖరి అస్త్రం

సాక్షి, సిటీబ్యూరో: దాదాపు వారం రోజుల్లో ఈ ఆర్థిక సంవత్సరం (2022-23) ముగియనున్న నేపథ్యంలో వీలైనంత మేర ఆస్తిపన్ను వసూలు చేసేందుకు జీహెచ్‌ఎంసీ కసరత్తు చేస్తోంది. ఇప్పటికే నిత్య సమీక్షలతో.. ఎప్పటికప్పుడు వసూళ్ల లక్ష్యాలు విధించి సంబంధిత సిబ్బందిని ఉరుకులు పరుగులు తీయించిన జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు.. మిగిలిన కొద్ది రోజుల్లోనూ వీలైనంత ఎక్కువ వసూలు చేయాలని భావిస్తున్నారు. ఇందులో భాగంగా ఇప్పటి వరకు ఆస్తిపన్ను చెల్లించని ఇళ్ల యజమానులకు కమిషనర్ పేరిట ఎస్‌ఎంఎస్‌లు పంపుతున్నారు. ఆస్తిపన్ను బకాయిలపై నెలకు 2 శాతం చొప్పున పెనాల్టీ పడకుండా ఉండేందుకు ఇప్పటి వరకు ఆస్తిపన్ను చెల్లించని వారు వెంటనే చెల్లించాలని కోరుతూ ఎస్‌ఎంఎస్‌లు పంపడాన్ని ముమ్మరం చేశారు.



అంజనేయులు మృతదేహాని పరిశీలిస్తున్న సీఐ గురువయ్యగౌడ్, ఎస్‌ఐ మహేశ్వర్‌రెడ్డి

పండుగ పూట విషాదం

- విద్యుత్ తీగ తెగి పైన పడటంతో షాక్
- గోపిగడ్డలో కౌలు రైతు మృత్యువాత

షాబాద్: పండుగ పూట విషాదం నెలకొంది. ప్రమాదవశాత్తు విద్యుత్ తీగ తెగిపడి కౌలు రైతు అక్కడిక్కడే మృతి చెందిన సంఘటన షాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ గురువయ్యగౌడ్, బాధిత కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. గోపిగడ్డ గ్రామానికి చెందిన జొన్నాడ అంజనేయులుగౌడ్(46) బుధవారం ఉదయం తక కొడుకు ధనుష్‌తో కలిసి పొలం వద్దకు వెళ్లాడు. వరి పంటలో నీళ్లను చూస్తుండగా పైనుంచి తెగిన విద్యుత్ తీగ అతని చేతిపై పడింది. షాక్‌కు గురైన ఆంజనేయులు పొలంలోనే ప్రాణం వదిలాడు. కుటుంబమంతా సంతోషంగా ఉగాది పండుగను చేసుకునేందుకు సిద్ధమవగా.. పొలం వద్దకు వెళ్లివస్తానని చెప్పిన ఆంజనేయులుగౌడ్ మృత్యువాత పడ్డాడు. ఇతనికి భార్య, ఇద్దరు కుమారులు హరీశ్‌గౌడ్, ధనుష్‌గౌడ్ ఉన్నారు. ఇదిలా ఉండగా విద్యుత్ తీగలు కిందకు వేలాడుతున్నాయని ఎన్నిసార్లు చెప్పినా.. అధికారులు, సిబ్బంది పట్టించుకోలేదని పలువురు రైతులు తెలిపారు. విద్యుత్ శాఖ ఏఈ నరేందర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సులభంగా.. అర్థమయ్యేలా!

సాక్షి, సిటీబ్యూరో: పదో తరగతి వార్షిక పరీక్షల నేపథ్యంలో 'స్టడీ మెటీరియల్' అందుబాటులోకి వచ్చింది. ఎస్‌సీఈఆర్‌టీ నిపుణులచే పాఠ్యాంశాల్లోని కీలక అంశాలు సులభంగా అర్థమయ్యేలా ప్రత్యేక స్టడీమెటీరియల్‌ను రూపకల్పన చేయించింది. అభ్యాస దీపిక, స్ఫూర్తి పేరిట ప్రచురించిన వివిధ సబ్జెక్టుల స్టడీ మెటీరియల్‌ను ప్రభుత్వ, జెడ్‌పీహెచ్ పాఠశాల విద్యార్థులకు పంపిణీ చేశారు. మరోవైపు ఎస్‌సీఈఆర్‌టీ వెబ్‌సైట్‌లో స్టడీ మెటీరియల్‌ను అందుబాటులో ఉంచారు.

ప్రాంతీయ భాషల్లో సాంకేతిక పదాలు..

గత విద్యా సంవత్సరం మాదిరిగా కాకుండా మారిన మోడల్ పేపర్‌కు అనుగుణంగా 100 శాతం సిలబస్‌తో ఆంగ్లం, తెలుగు, ఉర్దూ మాధ్యమాల్లో మెటీరియల్‌ను రూపకల్ప చేశారు. గణితం, భౌతిక, రసాయన, జీవశాస్త్రాలు సహా సాంఘిక శాస్త్రంలోని సాంకేతిక పదాలను ఆంగ్లం, తెలుగు, హిందీ, కన్నడ, మరాఠీ, తమిళం భాషల్లో పొందుపర్చారు.

మా'మిడి'!

మామిడి రైతులు ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. ఈసారి పూత, కాత సరిగా లేకపోవడంతో దిగుబడి గణనీయంగా తగ్గనుంది. అక్కడక్కడ కొన్ని చెట్లకు పట్టిన పిందె, కాత ఇటీవల కురిసిన వడగళ్లు, వర్షానికి నేల రాలింది. ఈదురు గాలుల ప్రభావంతో పలు చోట్ల వృక్షాలు నేలకొరిగాయి.

పూత, కాత అంతంతే
- విజృంభించిన తామర తెగులు
- విరుచుకుపడిన అకాల వర్షాలు
- తగ్గనున్న దిగుబడి
- ప్రభుత్వం ఆదుకోవాలని రైతుల వేడుకోలు

షాద్‌నగర్: గతేడాది మంచి లాభాలను ఆర్జించిన మామిడి రైతులకు ఈసారి నష్టాలే మిగలనున్నాయి. వాతావరణంలో ఏర్పడిన మార్పుల కారణంగా తోటలకు తెగుళ్లు సోకాయి. వీటి ప్రభావంతో పూత విపరీతంగా రాలిపోయింది. పిందె, కాత నేల రాలింది. గతేడాది జిల్లా వ్యాప్తంగా 70నుంచి 80 వేల టన్నుల దిగుబడి రాగా.. ప్రస్తుత పరిస్థితిని చూస్తుంటే అందులో సగమైనా వచ్చేలా లేదు.

తామర పురుగు ప్రభావం

ఈ సీజన్‌లో మామిడి పంటకు తామర పురుగు సోకింది. పూత సమయంలో విజృంభించిన తెగులు కారణంగా పిందె పట్టలేదు. ఫలితంగా కాత పెద్దగా కనిపించడం లేదు. తామర పురుగును గుర్తించే లోపు నష్టం జరిగిపోయిందని కొంతమంది రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఏటా డిసెంబర్, జనవరి నాటికి చెట్లకు పూత వచ్చి.. ఫిబ్రవరి వరకు పిందెలు, కాత కనిపించేది. కానీ తామర పురుగు ప్రభావం, ప్రతికూల వాతావరణం, పగలు, రాత్రి ఉష్ణోగ్రతల్లో హెచ్చుతగ్గుల కారణంగా పూత, కాత నిలవలేదు.

దిగుబడి అరకొరే..

గత ఏడాదితో పోలిస్తే ఈసారి మామిడి పంట దిగుబడి పూర్తిగా తగ్గనుంది. షాద్‌నగర్, మొయినాబాద్, చేవెళ్ల, తలకొండపల్లి, ఆమనగల్లు, కందుకూరు, కొందుర్గు తదితర మండలాల్లోని తోటల్లో ఎక్కువగా కేసరి, రసాలు, దసేరి, చిన్న రసాలు, పెద్ద రసాలు వంటి వెరైటీలు ఎక్కువగా ఉన్నాయి.



కేశంపేట మండలం సంగెం గ్రామ శివారులో కాత, పూత లేని మామిడి తోట

సాగు విస్తీర్ణం:	22,577 ఎకరాలు
రైతులు:	4,645 మంది
సాధారణ దిగుబడి:	80,000 టన్నులు
ఏటా ఆదాయం: సుమారు రూ.200 కోట్లు	

గతేడాది కురిసిన భారీ వర్షాలతో భూగర్భ జలాలు పుష్కలంగా లభించాయి. దీనికితోడు అనుకూలమైన వాతావరణం ఉండటంతో మంచి దిగుబడులు వచ్చాయి. దీంతో రైతులు సంబరపడ్డారు. ఈసారి తోటలు ఆశించిన స్థాయిలో లేవని చెబుతున్నారు. ఇదిలా ఉండగా దిగుబడులు తగ్గడంతో ధరలు పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు పేర్కొంటున్నారు.

ముంచిన వాన

శంకర్‌పల్లి, రాజేంద్రనగర్, చేవెళ్ల, యాచారం తదితర ప్రాంతాల్లో ఇటీవల 36 మిల్లీమీటర్ల నుంచి 46 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ఆమనగల్లు, కందుకూరు, అబ్దుల్లాపూర్‌మెట్‌లో 18 నుంచి 24 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అకాల వర్షాలతో తోటలు పాడయ్యాయి. మందులు, ఎరువులకు లక్షల రూపాయలు ఖర్చు చేసిన రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని కోరుతున్నారు.

తెగులు సోకింది



ఈ ఏడాది మామిడి చెట్లకు తెగులు సోకింది. చాలా వరకు పూత రాలిపోవడంతో దిగుబడి పూర్తిగా తగ్గనుంది. ఇటీవల కురిసిన వర్షానికి చెట్లకు ఉన్న కొద్దిపాటి కాత సైతం రాలిపోయింది. ప్రభుత్వమే పరిహారం అందించి ఆదుకోవాలి.

– మల్లయ్య, లేమామిడి, కేశంపేట మండలం

అవగాహన కల్పిస్తున్నాం

వాతావరణంలో చోటుచేసుకున్న మార్పుల ప్రభావం మామిడి తోటలపై పడింది. ఉష్ణోగ్రతల్లో హెచ్చు తగ్గుల కారణంగా పూత రాలిపోయింది. తెగుళ్ల నుంచి పంటను కాపాడుకునే చర్యలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

– సునందరాణి, జిల్లా ఉద్యానశాఖ అధికారి

జీతాల 'పంచాయితీ'


పారిశుద్ధ్య పనులు చేస్తున్న పంచాయతీ కార్మికులు

- పంచాయతీ కార్మికులకు అందని వేతనాలు
- మూడు నెలలుగా నిరీక్షణ
- రేపు మాపు అంటున్న అధికారులు
- అప్పుల ఊబిలో కుటుంబాలు

ఇబ్రహీంపట్నం రూరల్: పంచాయతీ కార్మికులు, సిబ్బంది బతుకులు అగమ్యగోచరంగా మారాయి. తెల్లవారుజామునే రోడ్లపైకి వచ్చి చెత్తాచెదారాన్ని శుభ్రం చేస్తున్నా వేళకు జీతాలు అందడం లేదు. గత డిసెంబర్ నుంచి నేటి వరకు జీతాలు రాక ఇబ్బందులు పడుతున్నారు. దీంతో అప్పులు చేసి కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. ఇబ్రహీంపట్నం మండలంలో 14 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటిలో బిల్ కలెక్టర్లు, కారోబార్లు, వాటర్ మెన్, కంప్యూటర్ ఆపరేటర్లు, కమోటీ, స్వీపర్లు పని చేస్తున్నారు. వీరంతా నాల్గవ తరగతి ఉద్యోగుల కంటే దీనమైన పరిస్థితిలో జీవనం సాగిస్తున్నారు. బిల్ కలెక్టర్లు, కారోబార్లు మినహాయిస్తే మెజార్టీ పారిశుద్ధ్య పనులు చేసే వారు దళిత కుటుంబాలకు చెందిన వారే. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పారిశుద్ధ్య కార్మికుడికి నెలకు రూ. 18 వేల జీతం ఇవ్వాలి. కానీ ఇదెక్కడా అమలు కావడం లేదు. ప్రతి పంచాయతీలో పని చేసే సిబ్బంది, కార్మికులకు రూ. 4వేల నుంచి మొదలుకొని రూ. 12వేల వరకు మాత్రమే చెల్లిస్తున్నారు. ఇచ్చేది తక్కువ జీతమే అయినా నెలనెలా ఇవ్వడం లేదని, ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి నెలకొందని పలువురు వాపోతున్నారు. రెండు రోజుల క్రితం ఒక నెల జీతం మాత్రమే చెల్లించినట్లు తెలిసింది. మండలంలోని 14 పంచాయతీల్లో 350 మంది వివిధ పనులు చేస్తుంటారు. వీరంతా జీతాల కోసం పడిగాపులు కాస్తున్నారు. పంచాయతీలు ప్రతి బిల్లునూ ట్రెజరీ ద్వారానే చెల్లించాల్సి ఉంటుంది. ప్రభుత్వం ఆర్థిక శాఖ నుంచి సరైన మార్గదర్శకాలు జారీ చేయకపోవడంతో నెలలుగా చెక్కులు విడుదల కావడం లేదు. ఒక్కో పంచాయతీలో కనీసం తక్కువలో తక్కువగా 10లక్షల రూపాయల విలువ చేసే బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. జీతాలు ఇవ్వలేని పరిస్థితిలో పంచాయతీలు ఉన్నాయంటే అర్థం చేసుకోవచ్చు. జీతాల కోసం పంచాయతీ కార్మికులు అధికారుల చుట్టూ తిరగలేక ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు సైతం సమాధానం చెప్పలేక మొహం చాటేస్తున్నారు.

అప్పులు చేస్తున్నాం



ఉదయం నుంచి సాయంత్రం వరకు పంచాయతీల్లో పనులు చేస్తున్నాం. కానీ జీతాలు మాత్రం సకాలంలో రావడం లేదు. పిల్లల స్కూల్ ఫీజులు కట్టలేక పోతున్నాం. కుటుంబ పోషణ భారంగా మారింది. రేషన్ బియ్యంతో కాలం నెట్టుకొస్తున్నాం. ప్రతి నెలా క్రమం తప్పకుండా జీతాలు వస్తే బాగుంటుంది. – సుక్కమ్మ, పంచాయతీ పారిశుద్ధ్య కార్మికురాలు, కప్పపహాడ్

జీతాలు చెల్లించాలి



పంచాయతీ కార్మికులు, సిబ్బంది పెండింగ్ జీతాల ను వెంటనే చెల్లించాలి. ప్ర భుత్వం పారిశుద్ధ్య కార్మికు ల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదు. కడుపు చేత పట్టుకొని గ్రామాలను శుభ్రం చేస్తారు. అ లాంటి వారిని ఉపవాసం ఉంచితే ఎవరికీ మంచిది కాదు. సీఐటీయూ ఆధ్వర్యంలో జీతాలు ఇచ్చే వర కు పోరాటం చేస్తాం. కలెక్టర్ కార్యాలయాలు ముట్టడిస్తాం. – జగదీష్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు

'సాగర్'లో నీట మునిగి యువకుడి మృతి


గౌని శివకుమార్ గౌడ్ (ఫైల్)

తుర్కయంజాల్: నల్లగొండ జిల్లా నాగార్జున సాగర్ బ్యాక్ వాటర్‌లో మునిగి తుర్కయంజాల్ మండలం కమ్మగూడకు చెందిన గౌని శివకుమార్ గౌడ్(32) మృతి చెందారు. ఈ సంఘటన బుధవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. శివకుమార్ తుర్కయంజాల్ ఎస్‌బీఐలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. బుధవారం తోటి ఉద్యోగులు, మిత్రులతో కలసి కారులో వైజాగ్ కాలనీకి వెళ్లారు. చేపల వేటకు వినియోగించే బోటులో మిత్రులతో కలిసి నాగార్జున సాగర్ బ్యాక్ వాటర్‌లో షికారుకు వెళ్లారు. బోటు ఒడ్డుకు వస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు శివకుమార్ నీటిలో పడి గల్లంతయ్యాడు. తోటి మిత్రులు, జాలర్లు పోలీసులకు సమాచారం ఇచ్చారు. గాలింపు చర్యల్లో శివకుమార్ మృతదేహం లభించింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

బ్రహ్మానందంకు సన్మానం

బంజారాహిల్స్: ఫిలింనగర్ కల్చరల్ సెంటర్‌లో బుధవారం రాత్రి ఉగాది వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ వేడుకల్లో పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు పాల్గొన్నారు. వేడుకల్లో భాగంగా హాస్యనటుడు, పద్మశ్రీ డాక్టర్ బ్రహ్మానందంను కల్చరల్ సెంటర్ సభ్యులు ఘనంగా సన్మానించారు. మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, కల్చరల్ సెంటర్ అధ్యక్షుడు ఆది శేషగిరి రావు దర్శకుడు త్రివిక్రమ్ పాల్గొన్నారు.

భక్తితోనే మానసిక ప్రశాంతత

- ఉప సర్పంచుల ఫోరం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి
- శబరిమల పాదయాత్ర వాల్ పోస్టర్ ఆవిష్కరణ


శబరిమల పాదయాత్ర వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

మొయినాబాద్ రూరల్: దైవ భక్తితోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఉప సర్పంచుల ఫోరం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు అల్లం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని కనకమామిడి అయ్యప్ప సన్నిదానంలో జై శ్రీరామ్ శబరిమల మహా పాదయాత్ర వాల్‌పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. అక్టోబర్ 27న పాదయాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. ఐదు సంవత్సరాల నుంచి అజీజ్‌నగర్ హనుమాన్ ఆలయ సన్నిదానం నుంచి పాదయాత్రగా అయ్యప్ప స్వాములు శబరిమలకు వెళ్తున్నారని తెలిపారు. ప్రస్తుతం అజీజ్‌నగర్ హనుమాన్ ఆలయం, కనకమామిడి అయ్యప్ప ఆలయం నుంచి భక్తులు శబరిమలకు వెళ్లనున్నట్లు తెలిపారు. పాదయాత్రగా వెళ్లే భక్తులు ముందుగానే తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అయ్యప్ప భక్తులు సుదర్శన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, గోవింద్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గౌడ్స్ సొసైటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్‌గౌడ్


నియామక పత్రం అందుకుంటున్న శ్రీనివాస్‌గౌడ్

మంచాల: గౌడ్స్ సొసైటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మంచాల మండలం ఆరుట్ల గ్రామానికి చెందిన నైనంపల్లి శ్రీనివాస్‌గౌడ్ ఎన్నికయ్యారు. బుధవారం నగరంలో నిర్వహించిన సంఘం విస్తృత స్థాయి సమావేశంలో ఆయన్ను ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడు అమరేందర్ గౌడ్ శ్రీనివాస్‌గౌడ్‌కు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను శక్తి వంచన లేకుండా నిర్వహిస్తానన్నారు. రాష్ట్రంలోని గౌడ కులస్తులను ఏకం చేసి వారి సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై పోరాటం చేస్తామన్నారు. గౌడ కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించడమే కాకుండా వారిని చైతన్య పరుస్తామన్నారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర కమిటీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీ ప్రవీణ్‌గౌడ్, సంయుక్త కార్యదర్శి పీ మధుగౌడ్, నాయకులు నరేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ సాగుతో నేల, నీరు పదిలం

జిల్లా నాబార్డ్ మేనేజర్ షివి శర్మ




సేంద్రియ సాగుపై అవగాహన కల్పిస్తున్న జిల్లా నాబార్డు మేనేజర్ షివి శర్మ


సేంద్రియ సాగును పరిశీలిస్తున్న రైతులు

మహేశ్వరం: సేంద్రియ సాగుతో నేల, నీరు, వాతావరణం కలుషితం కాదని, ఆరోగ్యకరమైన ఆహారం అందుబాటులోకి వస్తుందని జిల్లా నాబార్డ్ మేనేజర్ షివి శర్మ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని అమీర్‌పేట్‌లో రైతు నేస్తం ఆధ్వర్యంలో రైతు హరిబాబు వ్యవసాయ క్షేత్రంలో సేంద్రియ వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఎక్కువ మంది రైతులు వ్యవసాయం, దాని అనుబంధ రంగాలపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. సేంద్రియ సాగుపై అవగాహన లేక అనుకున్న రీతిలో ఫలితాలు సాధించలేక పోతున్నారని తెలిపారు. సాగులో రసాయన మందుల వాడకాన్ని తగ్గించాలన్నారు. సేంద్రియ వ్యవసాయంతో దిగుబడి తోపాటు చీడపీడలు రావన్నారు. అంతకు ముందు వివిధ రకాల కషాయాల తయారీ విధానాన్ని ఆదిలక్ష్మి, నారాయణ మనోహరాచారి ప్రత్యక్షంగా చూపిస్తూ వివరించారు. తక్కువ పెట్టుబడితో ఉద్యానవన పంటల సాగును రైతు హరిబాబు వివరించారు. వ్యవసాయ ఉత్పత్తుల గురించి రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్ వెంకటేశ్వర రావు వివరించారు. అనంతరం రైతులకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో సర్టిఫికెట్లు అందజేశారు.

ప్రయాణికులు 18 లక్షలకు పైనే..

హైదరాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి పెరిగిన రద్దీ



ఈ ఏడాది ఫిబ్రవరిలో విమానాలు, ప్రయాణికుల రాకపోకలు

- అంతర్జాతీయ విమానాలు 1833
  ప్రయాణికులు : 288427
- దేశీయ విమానాలు : 11557
  ప్రయాణికులు : 1556898
- మొత్తం విమానాల రాకపోకలు : 13390
  ప్రయాణికులు : 18,45,325

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నిత్యం ప్రయాణికులతో కిటకిటలాడుతోంది. గత నెలలో ఏకంగా 18 లక్షల మందికిపైగా ప్రయాణికులు ఈ విమానాశ్రయం గుండా గమ్యస్థానాలకు చేరుకోవడం ద్వారా గణనీయమైన వృద్ధిని సాధించింది. మన నగరం నుంచి జాతీయ, అంతర్జాతీయ నగరాలకు ప్రయాణికుల రద్దీ అనూహ్యంగా పెరిగింది. ఈ సంవత్సరం ఒక్క ఫిబ్రవరి నెలలోనే 13 వేలకు పైగా విమానాలు రాకపోకలు సాగించగా 18,45,325 మంది ప్రయాణం చేసినట్లు ఎయిర్‌పోర్ట్ వర్గాలు తెలిపాయి. వారిలో 2 లక్షల మందికి పైగా అంతర్జాతీయ ప్రయాణికులు ఉన్నారు. గత సంవత్సరం మే నెలలో 17.5 లక్షల మంది ప్రయాణం చేయగా, ఈ సంవత్సరం ఫిబ్రవరి నెలలో ఆ సంఖ్య 18 లక్షలు దాటడం గమనార్హం. మరోవైపు శంషాబాద్ ఎయిర్‌పోర్టు ఏర్పాటై ఈ ఏడాదికి 15 సంవత్సరాలు పూర్తవుతోంది.

80పైగా నగరాలకు నేరుగా కనెక్టివిటీ

హైదరాబాద్ నుంచి సుమారు 80కి పైగా నగరాలకు నేరుగా కనెక్టివిటీ ఉండడం, టర్మినల్‌ల విస్తరణతో ప్రయాణికులకు మెరుగైన సదుపాయాలు లభించడం వంటి పరిణామాలు కూడా ప్రయాణికుల ఆదరణకు దోహదం చేశాయి. మరోవైపు తెలుగు రాష్ట్రాల నుంచి పర్యాటకుల రాకపోకలు కూడా గణనీయంగా పెరిగాయి. ఫస్ట్‌క్లాస్ ఏసీ, సెకెండ్ క్లాస్ ఏసీ రైలు చార్జీలలోనే విమాన ప్రయాణానికి అవకాశం లభించడంతో మధ్యతరగతి వర్గాలు సైతం నింగిలోకి దూసుకెళ్లేందుకే ఆసక్తి చూపుతున్నారు. ఇంటిల్లిపాది కలిసి తిరుపతి, ఢిల్లీ, బెంగళూరు, జైపూర్ వంటి నగరాలకు వెళ్లేందుకు ఫ్లైట్ జర్నీపట్ల ఆసక్తి చూపుతున్నట్లు పర్యాటక సంస్థలు అంచనా వేస్తున్నాయి. అమెరికా, బ్రిటన్, దుబాయ్ తదితర దేశాలకు విద్యార్థుల రాకపోకలు ఎక్కువయ్యాయి. అలాగే అంతర్జాతీయ పర్యాటకుల సంఖ్య కూడా ఇతోధికంగా పెరిగింది. ప్రతి రోజు 55 వేల నుంచి 60 వేల మందికి పైగా రాకపోకలు సాగిస్తున్నారు. సుమారు 500 విమానాలు హైదరాబాద్ నుంచి వివిధ ప్రాంతాలకు సర్వీసులను అందజేస్తున్నాయి.

విస్తరణతో మెరుగైన సదుపాయాలు

విమానాశ్రయంలో అంతర్జాతీయ ప్రయాణికులు రాకపోకలు సాగించే డిపార్చర్, అరైవల్ హాళ్లను విస్తరించారు. ఈ హాళ్లు టెర్మినల్ భవనానికి కలిసిపోయి ఉండడంతో ప్రయాణికులకు ఎంతో ఊరట లభించింది. సుమారు 12,715 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉన్న కొత్త అరైవల్ హాల్, అందమైన ఇండోర్ ల్యాండ్‌స్కేప్, ఆకర్షణీయమైన డిజైన్ ఫీచర్ గోడలతో ప్రయాణికులకు ఆహ్లాదకరమైన అనుభూతి లభించేవిధంగా ఏర్పాట్లు చేశారు. అలాగే దేశీయ విమానాలరాకపోకలు పెరిగాయి. గతంలో 55 నగరాలకు మాత్రమే విమాన సదుపాయం ఉంటే ఇప్పుడు 70 నగరాలకు కనెక్టివిటీ అందుబాటులోకి వచ్చింది. అలాగే బాగ్దాద్, ఢాకా వంటి కొత్త నగరాలకు విమాన సర్వీసులు ప్రారంభమయ్యాయి.

ప్రయాణికుల సేవలో 15 ఏళ్లు

హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం ఈ ఏడాదితో 15వ సంవత్సరంలోకి చేరుకుంది. ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, తెలంగాణ ప్రభుత్వం, మలేషియా ఎయిర్‌పోర్ట్స్ హోల్డింగ్స్ బెర్హాడ్ సంయుక్త భాగస్వామ్యంతో జీఎమ్మార్ 2008లో ఈ ఎయిర్‌పోర్టును నిర్మించిన సంగతి తెలిసిందే. 2015 నాటికి అన్ని దేశీయ విమానాలకు ఎండ్ టూ ఎండ్ ఈ- బోర్డింగ్ సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చారు. ప్రస్తుతం డొమెస్టిక్ ప్రయాణికులకు పూర్తిస్థాయిలో 'స్టాంపింగ్ రహిత' సేవలను అందజేస్తున్న ఏకైక ఎయిర్‌పోర్టుగా హైదరాబాద్ నిలిచింది. అలాగే ప్రయాణికుల సేవల విస్తరణలో భాగంగా 2017 ఆగస్టు నాటికి హ్యాండ్ బ్యాగేజీతో ప్రయాణించే వారి కోసం ఎక్స్‌ప్రెస్ సెక్యూరిటీ చెక్ సదుపాయాన్ని ఏర్పాటు చేశారు. అలాగే 2019లో మొట్టమొదటిసారి ఫేస్ రికగ్నిషన్‌ను ప్రారంభించారు. ఇటీవల డాన్ ముయాంగ్ అంతర్జాతీయ విమానాశ్రయం, న్యూ గోవా అంతర్జాతీయ విమానాశ్రయం మోపాకు హైదరాబాద్ నుంచి విమాన సేవలు అందుబాటులోకి వచ్చాయి. దేశంలోనూ, దక్షిణాసియాలోనూ అత్యుత్తమ ఎయిర్‌పోర్టుగా స్కైట్రాక్స్ వరల్డ్ ఎయిర్‌పోర్ట్ అవార్డ్స్ 2022ను అందుకోవడం మరో విశేషం. ప్రస్తుతం 15వ వార్షికోత్సవంలో భాగంగా సోషల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారాన్ని చేపట్టారు. ఈ ప్రచారంలో ప్రఖ్యాత కళాకారుల సంగీత కార్యక్రమాలు, దుబాయ్‌కి చెందిన అంతర్జాతీయ కళాకారుల విన్యాసాలు ఉంటాయి.

దారిలో గ్రీనరీ

పచ్చదనం, పూలమొక్కలతో ఆకట్టుకుంటున్న జాతీయ రహదారులు





- రూ.18.61 కోట్లతో వరంగల్, నాందేడ్ హైవేలపై అభివృద్ధి చేసిన హెచ్‌ఎండీఏ
- సెంట్రల్ మిడెన్ గ్రీనరీ, మల్టీలేయర్ ప్లాంటేషన్ పనులు పూర్తి
- గ్రీన్ కారిడార్‌గా వరంగల్ రహదారి
- శ్రీశైలం, కరీంనగర్ హైవేల్లోనూ పచ్చదనం పెంపు

సాక్షి, సిటీబ్యూరో: జాతీయ రహదారులు పచ్చదనంతో అలరారుతున్నాయి. అందమైన పూల మొక్కలతో వేసవిలోనూ ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. నగరానికి నలు వైపులా జాతీయ రహదారులపై హెచ్‌ఎండీఏ చేపట్టిన సుందరీకరణ, పచ్చదనం విస్తరణ పనులు పరుగులు తీస్తున్నాయి. వరంగల్ జాతీయ రహదారిలో రాయగిరి క్రాస్ రోడ్స్ వరకు ఉన్న మల్టీలేయర్ ప్లాంటేషన్ జనగామ వరకు పొడిగించేందుకు హెచ్‌ఎండీఏ చర్యలు చేపట్టింది. సుమారు రూ.15.04 కోట్ల వ్యయంతో 64 కిలోమీటర్ల మార్గంలో పనులు పూర్తి చేశారు. ప్రస్తుతం జనగామ వరకు మల్టీలేయర్ ప్లాంటేషన్ వాహనదారులను, ప్రయాణికులను విశేషంగా ఆకట్టుకుంటోంది. నాందేడ్ హైవే వెంట కంది క్రాస్ రోడ్స్ నుంచి రామ్‌సాన్ పల్లె వరకు 32.77 కిలో మీటర్ల పొడవున దాదాపు రూ 3.57 కోట్ల వ్యయంతో సెంట్రల్ మిడెన్, ఎవెన్యూ ప్లాంటేషన్ పనులు చేసింది. శ్రీశైలం హైవేలో శంషాబాద్ ఎయిర్ పోర్టు నుంచి మహేశ్వరం వరకు 18 కిలోమీటర్లు, కర్నూలు హైవేపై ఆరాంఘర్ నుంచి షాద్ నగర్ వరకు 25 కిలోమీటర్ల సెంట్రల్ మిడెన్ గ్రీనరీ, మల్టీ లేయర్ ప్లాంటేషన్‌ను ఏర్పాటు చేసి పచ్చదనం పరిరక్షణ కోసం చర్యలు చేపట్టింది. రాజీవ్ రహదారి వెంట శామీర్‌పేట నుంచి గజ్వేల్ వరకు 39 కిలోమీటర్ల మేర పచ్చదనాన్ని అభివృద్ధి చేశారు.

పచ్చదనం అభివృద్ధిలో రోల్‌మోడల్..

పచ్చదనం అభివృద్ధి, విస్తరణ కోసం హెచ్‌ఎండీఏ అమలు చేస్తున్న ప్రణాళికలు దేశంలోనే ఆదర్శంగా నిలిచినట్లు ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. హెచ్‌ఎండీఏ గ్రీనరీపై నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా గతంలోనే అధ్యయనం చేసింది. ఇటీవల కేరళకు చెందిన పలువురు ఉన్నతాధికారులు సైతం రహదారులను సందర్శించి పచ్చదనంపై అధ్యయనం చేయడం గమనార్హం. బెర్లిన్ యూనివర్సిటీకి చెందిన విద్యార్థి చార్లెట్ ఎడాలిన హ్యూమన్ జియోగ్రఫీ అనే అంశంపై పరిశోధనలో భాగంగా హెచ్‌ఎండీఏ చేపట్టిన మల్టీ లేయర్ ప్లాంటేషన్‌పై విస్తృత అధ్యయనం చేశారు.

గ్రీన్ కారిడార్‌గా వరంగల్ హైవే..

తొలి దశలో వరంగల్ హైవే గ్రీనరీ బ్యూటిఫికేషన్ పనులను రూ.5.5 కోట్ల అంచనాతో దాదాపు 30 కిలోమీటర్ల పొడవున ఘట్‌కేసర్ నుంచి రాయగిరి వరకు హెచ్‌ఎండీఏ కమిషనర్ అర్విండ్ కుమార్ పర్యవేక్షణలో పూర్తి చేశారు. ఇది ప్రత్యేక ఆకర్షణగా నిలవడంతో మల్టీలేయర్ ప్లాంటేషన్‌ను వరంగల్ వరకు పొడిగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. గ్రీనరీ బ్యూటిఫికేషన్ పనులు పూర్తి కావడంతో వరంగల్ రహదారి గ్రీన్ కారిడార్‌గా కనువిందు చేస్తోంది.

